## ఎన్ఎస్‌పీసీఎల్‌కు సింగరేణి బొగ్గు



హైదరాబాద్ మే 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి నుంచి ఎన్ఎస్‌పీసీఎల్(ఎన్‌టీపీసీ సెయిల్ పవర్ కంపెనీ)కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సింగరేణి కాలరీస్, ఎన్ఎస్‌పీసీఎల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్ ఎస్‌డీఎం సుభానీ సమక్షంలో సింగరేణి జీఎం(మార్కెటింగ్) ఎన్వీ రాజశేఖర్‌రావు, ఎన్ఎస్‌పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. సింగరేణి నాణ్యమైన బొగ్గు సరాఫరా చేస్తుందనే నమ్మకంతోనే ఈ ఒప్పందం చేసుకున్నామని ఎన్ఎస్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు.


## 5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ, మే 15: గత నెలలో దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం 5 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఏప్రిల్‌లో ఎగుమతులు 9.03 శాతం పెరిగి 38.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు 19.12 శాతం ఎగిసి 64.91 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 26.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ముడి చమురు దిగుమతులు 25.6 శాతం ఎగబాకి 20.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం దిగుమతులు 3.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

# డౌన్ ట్రెండ్‌లో గోల్డ్

### క్రమేణా తగ్గుముఖం పడుతున్న బంగారం ధరలు

- రెండు రోజుల్లో రూ.2,450 పతనం
- హైదరాబాద్‌లో స్వచ్ఛమైన పుత్తడి తులం రూ.93,930
- రూ.86,100 పలుకుతున్న 22 క్యారెట్ పసిడి విలువ



*గోల్డ్ మార్కెట్ రివర్స్ గేర్ తీసుకున్నది.*

*మొన్నటిదాకా ఫుల్ స్వింగ్‌లో ఉన్న బంగారం ధరలు ఇప్పుడు డౌన్ ట్రెండ్‌లోకి జారుకున్నాయి.*

*రెండు రోజుల్లో తులం విలువ రూ.2,450 పతనమైంది మరి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రేటు 10 గ్రాములు రూ.93,930 పలుకుతున్నది.*

న్యూఢిల్లీ, మే 15: దేశీయ మార్కెట్‌లో బంగారానికి గిరాకీ సన్నగిల్లిందా? అంటే.. అవునన్నట్టుగానే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొద్దిరోజులుగా పసిడి ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతుండటమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల్లోనే పుత్తడి రేటు దాదాపు రెండున్నర వేల రూపాయలు పడిపోయింది. గురువారం 24 క్యారెట్ తులం విలువ రూ.1,800 దిగజారి రూ.95,050కి పరిమితమైంది. బుధవారం కూడా రూ.650 క్షీణించగా, సోమవారమైతే ఏకంగా రూ.3,400 పతనం కావడం గమనార్హం.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లోనూ బంగారం ధరలు దిగొస్తున్నాయి. గురువారం 24 క్యారెట్ తులం రేటు రూ.2,130 తగ్గి రూ.93,930గా నమోదైంది. 22 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.1,950 పడిపోయి రూ.86,100గా ఉన్నది. అయితే ధరల్లో స్థిరత్వం లోపించడం.. కొనుగోలుదారులను వేచి చూసే ధోరణిలోకి నెడుతున్నదని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. మార్కెట్‌లో ఈ ఒడిదొడుకులు తగ్గితే వ్యాపారం తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత నెల ఏప్రిల్ 22న దేశీయంగా పసిడి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం 24 క్యారెట్ రూ.1,01,600 పలికిన సంగతి విదితమే.

**వెండి ధరలు కూడా..**

బంగారంతోపాటు వెండి ధరలూ దిగొస్తున్నాయి. వరుసగా నాల్గోరోజూ రేట్లు పడిపోగా.. గురువారం మరో రూ.1,000 తగ్గి కిలో వెండి విలువ రూ.97,000కు పరిమితమైంది. బుధవారం రూ.1,450 పతనమవగా, మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో రూ.2,900 క్షీణించినట్టైంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పడిపోతున్నాయని, ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా సహజంగానే ఉంటున్నదని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 16.81 డాలర్లు దిగి 3,160.71 డాలర్లకు చేరింది. మొత్తానికి ఆయా దేశాల మధ్య భౌగోళిక, రాజకీయ, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గడంతో ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులను బంగారం నుంచి వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇది ధరల క్షీణితకు దారితీస్తున్నట్టు అభివర్ణిస్తున్నారు.



**పతనానికి ప్రధాన కారణాలు**

- శాంతించిన భౌగోళిక ఉద్రిక్తతలు
- భారత్-పాక్ మధ్య తగ్గిన ఆందోళనలు
- అమెరికా-చైనా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్
- మళ్లీ స్టాక్ మార్కెట్లలోకి మదుపరుల పెట్టుబడులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల క్షీణత
- అంతంతమాత్రంగా డిమాండ్

## టాటా లాక్‌హీడ్‌పై కఠిన చర్యలు వద్దు

### ఈపీఎఫ్‌వోకు హైకోర్టు ఆదేశం


హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): బకాయిల వసూలులో భాగంగా విమాన విడిభాగాల తయారీ సంస్థ టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ ఎంఏఎల్)పై ఎంప్లాయిస్ ప్రావిడెంట్ కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21 వరకు నిషేధిత జాబితాలో ఉంచి ఖాతాలు స్తంభింపజేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2012 నుంచి 2017 మధ్యకాలంలో పనిచేసిన 14 మంది విదేశీ కార్మికులకు పీఎఫ్ జమ చేయకపోవడంతో ఈపీఎఫ్ఓ ఈ కంపెనీని నిషేధిత జాబితాలో చేర్చి బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈచర్యను టీఎల్ఎంఏఎల్ సంస్థ సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారించారు. సంస్థ ఇప్పటికే రూ.4 కోట్లు డిపాజిట్ చేసిందని, మిగిలిన రూ.10 కోట్లలో రూ.4.30 కోట్లు రికవరీ కూడా చేసినట్టు కంపెనీ తరుపున వాదిస్తున్న న్యాయవాది తెలిపారు. కౌంటర్ దాఖలు చేయాలని ఈపీఎఫ్ఓను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

# సెమీకండక్టర్ల ప్లాంట్ హుళక్కే?

### తాజాగా యూపీలో ఏర్పాటుచేస్తున్న ఫాక్స్‌కాన్

### ఇప్పటికే రాష్ట్రం నుంచి వెనక్కివెళ్లిన రెండు కంపెనీలు

హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఒక్కో సంస్థ ఇక్కడి అమడదూరంగా వెళ్లిపోతున్నాయి. దీంతో చిప్‌ల తయారీ పరిశ్రమ ఇక్కడికి రావడం ఎండమావిగానే కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేయలేమని భావించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయి. ఇప్పటివరకు దేశంలో ఆరు సెమీకండక్టర్ యూనిట్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా..అందులో మన రాష్ట్రానికి చోటు లేకపోవడం విశేషం. నాలుగు యూనిట్లు గుజరాత్‌లో ఏర్పాటుకానుండగా, ఒకటి అస్సాం, మరొకటి ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయింది. ఇక్కడ యూనిట్ ఏర్పాటునకు అవసరమైన పర్యావరణ పరిస్థితులు పుష్కలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి గుడ్‌బై పలుకుతున్నాయి. ఇదే క్రమంలో హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంలో రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్న ఈ యూనిట్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పీసీల కోసం డిస్‌ప్లే డ్రైవ్ చిప్‌లు తయారుకానున్నాయి. తాజా చిప్ యూనిట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ భవితవ్యంపై సర్వత్రా చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్‌ను సెమీకండక్టర్ల తయారీలోనూ అభివృద్ధి చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమకు అవసరమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విశేష కృషితో కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, కేన్స్ సెమికాన్ కంపెనీలు రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్లు స్థాపించేందుకు ముందుకొచ్చాయి. ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్నింగ్ తమిళనాడుకు, కేన్స్ సెమికాన్ గుజరాత్‌కు తరలివెళ్లిపోయింది.



**సెమీకండక్టర్లకు గిరాకీ..**

సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ సెమీకండక్టర్ల పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గిరాకీ అంతాఇంతా కాదు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక అవసరాలు, విమానయాన రంగం తదితర వాటిల్లో చిప్‌ల వినియోగం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్నది. ఇందులో భాగంగా దిగుమతులను తగ్గించి దేశంలోనే సెమీకండర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం)ను ఏర్పాటు చేసింది.

**రాష్ట్రానికి రావడానికి జంకుతున్న కంపెనీలు**

సెమీకండక్టర్ యూనిట్ల స్థాపనకు రాష్ట్రంలో పుష్కలమైన వనరులు ఉన్నప్పటికీ కంపెనీలు ముందుకు రాకపోవడంపట్ల పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలను అందిస్తున్నప్పటికీ.. సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకురావడం లేదు. వీటిలో అమెరికాకు చెందిన ఇంటెల్, క్వాల్కమ్, మైక్రోచిప్ టెక్నాలజీ ఇంక్.. అలాగే, జర్మనీకి చెందిన ఇన్ఫినియస్ టెక్నాలజీ, టెస్సోల్, మైక్రాస్ టెక్నాలజీ, మోస్‌చిప్, మిరాఫ్రా టెక్నాలజీ, ఏఎండీలు ఉన్నాయి.

## అమ్మకానికి భూములు

### రూ.1,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం

న్యూఢిల్లీ/ముంబై, మే 15: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) స్థిరీకరణకు.. వాటి భూములను అమ్మే దిశగా కేంద్ర ప్రభుత్వం వెళ్తున్నది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దాదాపు రూ.1,000 కోట్ల విలువైన భూములను విక్రయించాలని చూస్తున్నట్టు సంబంధిత అధికారి ఒకరు చెప్తున్నారు. తద్వారా ఆయా సంస్థల రుణ భారాన్ని తగ్గించవచ్చని, వాటి ద్రవ్యలభ్యతను కూడా పెంచవచ్చని అంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ) భూములను గుర్తించగా.. వీటిని వీలైతే అమ్మడమో లేదా లీజుకు ఇవ్వడమో చేసే ఆలోచనలో మోదీ సర్కారు ఉన్నది. కాగా, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు దేశంలోని ప్రధాన నగరాల్లో భూములుండగా.. 2-3 చోట్ల భూములను అమ్మకానికి తీసుకురాబోతున్నారు. ఈ ఏడాదిలోనే వీటిని అమ్మవచ్చని, రూ.1,000 కోట్లు రావచ్చని అంచనా.

**సర్కారీ వైఫల్యం**

ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ కంపెనీలతో పోటీపడలేక బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ చతికిలపడ్డాయి. అయితే ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వ పెద్దలేనన్న విమర్శలు ఆయా సంస్థల ఉద్యోగ సంఘాలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా స్పెక్ట్రం కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలాచాలా నష్టపర్చిందన్న వాదనలున్నాయి. దీంతో ఏండ్ల తరబడి నెట్‌వర్క్‌ను విస్తరించలేక, సిగ్నలింగ్ లోపాలతో సబ్‌స్క్రైబర్లు దూరమైపోతున్నారు. మరోవైపు ఆదాయం లేక, నిర్వహణ భారమై అప్పుల ఊబిలో కూరుకుపోయాయని చెప్తున్నారు. రుణ చెల్లింపుల్లో ఎంటీఎన్ఎల్ విఫలమవుతుండటంతో రుణదాతల (బ్యాంకర్లు)తో క్యాబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ శుక్రవారం సమావేశమవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

- గత ఏడాది నవంబర్ నాటికి బీఎస్ఎన్ఎల్ రుణ భారం రూ.23,297 కోట్లు.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.33,000 కోట్లు దాటిన ఎంటీఎన్ఎల్ మొత్తం అప్పులు.
- బ్యాంకులకు రూ.8,346 కోట్లను చెల్లించడంలో విఫలమైన ఎంటీఎన్ఎల్.

## వంతెనలు పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ నాయకులు

కెరమెరి, మే 15 : అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై వెంటనే వంతెన నిర్మాణాలు పూర్తి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా వంతెనల పనులు అసంపూర్తిగా ఉండడంతో పెద్దవాగు పరివాహక ప్రాంత గ్రామాలైన కరం జీవాడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్, ఆంద్‌గూడ, గోండ్‌గూడ ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో మాట్లాడి వంతెన పనుల ఆలస్యంపై సంబంధిత గుత్తేదారుతో మాట్లాడుతానని, వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారని రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ నైతం మోహన్, జిల్లా జాయింట్ కార్యదర్శి నైతం భానుచందర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మహేశ్, ఆసిఫాబాద్ మండల వైస్ చైర్మన్ కొండ శశాంక్ ఉన్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



కాసిపేట : కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ సింగ్



వేమనపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమారస్వామి

వేమనపల్లి , మే 15 : ఎండాకాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎంపీడీవో కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పైపులైన్లకు లీకేజీలుంటే మరమ్మతులు చేయించాలని, వన మహోత్సవానికి నర్సరీల్లోని మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట మండలంలో..**

కాసిపేట, మే 15 : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంచి నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని, వచ్చే వన మహోత్సవంకు మొక్కలు సిద్ధం చేయాలని, గ్రామ పంచాయతీలలో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను నిర్మాణం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ సహాయకులు తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ : ఆర్కే 6గనిపై మాట్లాడుతున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు



తాండూర్ : గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

## సమ్మె విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, మే 15 : బొగ్గు గని కార్మికులు ఈ నెల 20న సమ్మెచేసి గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6, ఎస్ఆర్పీ 1గనిపై కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులను సమ్మెకు సిద్ధం చేసేందుకు సమావేశం నిర్వహించారు. ఆర్కే 6 గనిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గనుల వేలాన్ని రద్దు చేయాలని, ప్రైవేటీకరణ విరమించుకోవాలని, సింగరేణికే గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల సవరణను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు ముస్త్యాల రమేశ్, నాయకులు రాంటెంకి మల్లయ్య , సందీప్, రాజేందర్, శ్రీకాంత్, సదానందం, మనిదర్ రెడ్డి, పానుగంటి వినయ్ పాల్గొన్నారు.

**ఎస్ఆర్పీ 1పై...**

ఎస్ఆర్పీ 1 గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. కార్మికులు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్మిక చట్టాల మార్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక, పారిశ్రామిక వ్యతిరేక విధానాలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు కురుమ వికాస్, మారం శ్రీను, తిరుపతి రావు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

**శాంతిఖని గని ఆవరణలో..**

తాండూర్/బెల్లంపల్లి, మే 15 : సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి జేఏసీ నాయకులు కోరారు. మందమర్రి ఏరియా శాంతిఖని గని ఆవరణలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్ లో నాయకులు మాట్లాడారు. నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి ఇంటి పథకం అమలు చేయాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనాల రమేశ్, చిప్ప నర్సయ్య, కుక్కల ఓదెలు, వెంకటస్వామి, మంతెన రమేశ్, దాడి రమేశ్, మిట్టపల్లి రమేశ్, మంతెన భాస్కర్, బొంకూరి రామచందర్, ఇనుముల్ల రాజమల్లు, లింగాల కిరణ్, సంతోష్, ఎం సంతోష్, వై గణేశ్, ఎస్ ప్రభాస్, రవి, బీ రామకృష్ణ, దుర్గం రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఖైర్‌గూడ ఓసీపీ లో సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**ఖైర్‌గూడ ఓసీపీలో..**

రెబ్బెన, మే 15: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ లో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సంపద సృష్టికర్తలు అయిన కార్మిక వర్గం హక్కులు లేకుండ చేసే కార్మిక చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేశ్, జగ్గయ్య, శేషు, చంద్రశేఖర్, దివాకర్, సహాయ కార్యదర్శి మాల ఓదెలు, షిఫ్ట్ ఇన్‌చార్జి వెంకటేశ్, తిరుపతి, సత్యనారాయణ, వీరు, మహేందర్, తదితరులున్నారు.

**గోలేటి టౌన్ షిప్‌లో..**

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయుసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరి సంగెం ప్రకాశ్‌రావు పిలుపునిచ్చారు. ఏరియా లోని గోలేటిటౌన్ షిప్‌లో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మె లో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. జాతీయ కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణి బొగ్గు గనులలో టోకెన్ సమ్మెకు మద్దతు తెలుపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకులు రామారావు, హూస్సేన్, ఏరియా కార్యదర్శులు మాధవకృష్ణ, బూర శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి గోలెం గట్టయ్య, బోయిన రాజేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి వామన్, ఫిట్ కార్యదర్శులు భాస్కరచారి, భీమేశ్, అసిస్టెంట్ కార్యదర్శులు గుమాస ప్రభాకర్, గోదాల వినయ్, నాయకులు రామ్మోహన్, స్వామి, అంబేద్కర్, ఆవుల శ్రీను, శంకర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం రాజ్‌కుమార్

## బీమా పథకాలపై అవగాహన ఉండాలి

జైపూర్, మే 15: కేంద్రం అందిస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన వంటి బీమా పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇందారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులతో కలిసి మహిళాసంఘాలతో సమావేశం నిర్వహించారు. బీమా పథకాలు, బ్యాంకు సేవలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమన్‌తో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, మే 15 : 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌తో ఎంసెట్ కోచింగ్ (కార్పొరేట్) ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 7జీపీఏ ఆపై ఫలితాలు సాధించిన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు, ఈబీసీ, మైనార్టీ దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతిలో మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశం కల్పిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నియామకం

శ్రీరాంపూర్, మే 15 : నస్పూర్ మండల మీడియా ఇంచార్జిగా రాకం విశాల్ పటేల్‌ను నియమించినట్లు తెలంగాణా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాంలు తెలిపారు. గురువారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మండల మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో సోషల్ మీడియా(అధికార ప్రతినిధి)గా నియమించామని తెలిపారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ నస్పూర్ మండలంలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. తనపై విశ్వాసంతో నస్పూర్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి(అధికార ప్రతినిది)గా నియమించిన రాష్ట్ర ఆధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశంలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దండేపల్లి, మే15: దండేపల్లి మండలంలోని ధర్మారావుపేటలో ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై ఆర్థిక అక్షరాస్యత కేంద్రం-దండేపల్లి సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా తాళ్లపేట ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ బ్యాంకులోని ఖాతాల రకాలు, ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు డిజిటల్ ఖాతాలు రుణ సౌకర్యాలతో కూడిన అదనపు ప్రయోజనాలు, బీమా, పింఛన్ పథకాలు, మరణించిన ఖాతాదారుల నామినీ ప్రాముఖ్యతపై వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి కౌన్సిలర్ రవీందర్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ హరీశ్, నూతన్‌కుమార్, రాకేశ్, ఉపాధి కూలీలు ఉన్నారు.

## దేవాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

కాసిపేట, మే 15 : కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ యాదవ్ భవన్ వద్ద నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గురువారం దేవాపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడుతాయని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు